మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి జడ్పీచైర్మన్ అభినందన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 5 : సూర్యాపేట నియోజకవర్గం నుంచి మరో మారు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారికి పూలబొకే అందించి, శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



సూర్యాపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన జగదీశ్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

బాలనర్సయ్యగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పారిశ్రామిక వేత్త బాలనర్సయ్యకు నివాళి

వలిగొండ, డిసెంబర్ 5 : మండలంలోని నెమిలకాల్వ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, రాజకీయ నాయకుడు వంగాల బాలనర్సయ్యగౌడ్ 13 వర్ధంతి సందర్భంగా మంగళవారం గ్రామ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి వంగాల ఈశ్వరయ్యగౌడ్, వంగాల వాసుదేవ్ గౌడ్, వంగాల వెంకన్న, వంగాల భిక్షపతి గౌడ్, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, గూడూరు శివశాంత్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, పబ్బు ఉపేందర్‌బోస్, మాద శంకర్‌గౌడ్, కాసుల కృష్ణగౌడ్, వంగాల రోహిత్, మల్లేశం, రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సుంకిశాల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సుంకిశాల వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయం

వలిగొండ, డిసెంబర్ 5 : మండలంలోని సుంకిశాల గ్రామంలో ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల 11 వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వేంకటేశ్వర సాంఘిక సంక్షేమ సేవాసమితి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివలింగాల ప్రతిష్ఠ

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 5 : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని రమణేశ్వరంలో మంగళవారం శివలింగాల ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధగురు రమణానందమహర్షి మాట్లాడుతూ సిద్ధగురువుల పేరుపై 29 శివలింగాల ప్రతిష్ఠ నిర్వహించినట్లు చెప్పారు. వర్షం పడుతున్నా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతంగా చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం కాళభైరవుని పేరుపై హోమం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

లింగ ప్రతిష్ఠ చేస్తున్న సిద్ధగురు రమణానందమహర్షి

ముసురుకుంది

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వాన
- మిగ్‌జాం తుఫాన్‌తో పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం
- పెరిగిన చలి..రోడ్లన్నీ నిర్మానుష్యం
- పజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ హనుమంతు కే. జెండగే

యాదగిరిగుట్టపై కమ్ముకున్న మబ్బులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 5 : బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్‌జాం తుఫాను కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు, చల్లటి గాలులతో ప్రజలు వణుకి పోతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రోజంతా జల్లులు కురుస్తున్నాయి. ముసురు మూలంగా ప్రజలు ఇండ్ల ల్లోంచి బయటికి రాక పోవడంతో రోడ్లన్ని బోసి పోయాయి. ముసురుతో పాటు గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరగగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సంస్థాన్‌నారాయణపురంలో 4.8 మి.మీ

జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురంలో అత్యధికంగా 4.8 మిమీల వర్షం కురియగా జిల్లాలో సగటున 1.6 మిమీ వర్షపాతం నమోదైంది. రామన్నపేట, గుండాల మండలాల్లో 3.4 మిమీల చొప్పున, భూదాన్‌పోచంపల్లిలో 3.2 మిమీ, తుర్కపల్లిలో 2.4 మిమీ, రాజాపేట, మోటకొండూరు, యాదగిరిగుట్టలో 1.8 మిమీల, ఆలేరులో 1.4 మిమీల చొప్పున వర్షపాతం నమోదైంది.

యాదగిరిగుట్టలో కురుస్తున్న వర్షం

పెరిగిన చలితీవ్రత

మిచౌంగ్ తుపాను కారణంగా మంగళవారం రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పాటు చల్లటి గాలులు వీస్తుండడంతో జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. చలి ధాటికి ప్రజలు ఇండ్లల్లోంచి బయటకు రావడానికి భయపడ్డారు. దాంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నదిలో వరద ఉధృతి పెరిగింది.

ఆలేరులో మోస్తరు వర్షం

యాదగిరిగుట్ట : మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆకాశమంతా మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు పడ్డాయి. యాదగిరిగుట్టలో ఈదురుగాలులు వీచాయి. స్థానికులు గొడుగులతో బయటకు వచ్చారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు.

రాజాపేట : మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొంతమేర తడిసింది. పత్తి, వరి పంటల కోతలు నిలిచిపోయాయి. చలిగాలులతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ముసురు పెట్టింది. వానతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందారు.

తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

తుఫాను కారణంగా రానున్న మూడు రోజులు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. మంగళవారం తాసీల్దార్లు, ఎంపీడీఓలు మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను కారణంగా వర్షాలు కురుస్తున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని, పాత గోడలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారిని సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని, చెరువుల వద్ద పరిస్థితులను పరిశీలిస్తుండాలని, గండ్లు పడే అవకాశం ఉన్న చోట్ల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్వర్టులు, రోడ్లు, బ్రిడ్జిలపై నీరు ప్రవహించే చోట్ల రాకపోకలకు అనుమతించవద్దని, పోలీసుల సమన్వయంతో బారికేడ్లు, బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వార్డుల్లో ఇండ్ల మధ్య నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూసీ పరివాహక మండలాలైన బీబీనగర్, భువనగిరి, వలిగొండ, పోచంపల్లి, రామన్నపేట పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యుత్ అధికారులు సరఫరాలో అంతరాయం లేకుండా, నష్టం కలుగకుండా చూసుకోవాలన్నారు. అధికారులెవరూ హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని, తమ టీములతో 24 గంటలు నిఘా ఉంచాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ శానిటేషన్ పనులను నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపాలిటీ, పోలీసు, నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి మూడు గంటలకు ఒక సారి నివేదికలు పంపాలని ఆదేశించారు. సహాయక చర్యల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 08685- 293316 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లోఅదనపు కలెక్టరు ఏ.భాస్కర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

నేడు మండల స్థాయి చెస్ పోటీలు

వలిగొండ, డిసెంబర్ 5: స్కూల్‌గేమ్స్‌లో భాగంగా భాగంగా నిర్వహిస్తున్న మండల స్థాయి చెస్ పోటీలను బుధవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర జడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 సంవత్సరాల్లోపు విద్యార్థులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వయస్సు ధ్రువీకరిస్తూ పాఠశాలల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకు రావాలని సూచించారు. ప్రతి స్కూల్ నుంచి ఒకరికే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు పాఠశాలల క్రీడల కార్యదర్శి గంజి చండీదాస్ సెల్ : 994864001 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 5 : పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ తోటకూరి వెంకటేయాదవ్ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించున్నారు. భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ తోటకూరి వెంకటేశ్ దంపతులు